ఈనాడు ఆదివారం - 23, ఫిబ్రవరి 1997

# నాకు పదహారేళ్ళు!

నేను రిటైరయిన మర్నాడు మా ఆవిడ పద్మావతి నాకు తలంటి పోసింది. ఆ పైన నా చేత పెద్దాపురం పట్టుపంచె కట్టింపజేసి, పట్టులాల్చీ ధరింపజేసి తనే ఎరుపు ఆకుపచ్చ అంచులున్న పట్టు కండువా కప్పింది. ఆ పైన తను నెమలి కంఠం రంగు బెనారస్ చీర బిగించి 'పదండి' అంటూ నన్ను మా ఇంటికి దగ్గరలో వున్న గుడికి తీసుకుని వెళ్ళింది. ముప్ఫైయేళ్ళు ఉద్యోగం చేసి బోల్డు శ్రమదమాదులు పడ్డంలో సహాయ సహకారాలు అందజేసిన స్నేహితులతోపాటు మన ఊరి దేవుడు రామలింగేశ్వరస్వామికీ ఋణపడి వున్నాం - అంది.... మా గోత్ర నామాలతో సహస్రార్చన జరిపించింది!!

నన్ను ఇంతవరకూ యాభై ఎనిమిది సంవత్సరాలు మోసిన నా శరీరాన్ని చూసినప్పుడల్లా నాకు ఆశ్చర్యం, ఆనందం రెండు కలుగుతాయి. దాన్ని కొంతకాలం నా లేత ఆలోచనలతో దారి తప్పిన ప్రేమికుడిగా చేసినా, వయసు పాకాన పడుతూంటే

మనసు శిఖండి అయి, అంతా నేనేనని గొప్పలు పోయినా అది కిమ్మనలేదు. హృదయంలో ప్రేమతత్వం మితమవుతూ, అహంకారం ఫౌంటెన్‌లోని రకరకాల రంగుల ధారలై ఉవ్వెత్తుగా లేస్తున్నా తటస్థుడిలానే వుండిపోయింది. తరచుగా కాకుండా, అప్పుడప్పుడు అంతఃకరణ తన ఉనికినీ, వ్యక్తి తాలూకు ధర్మాధర్మ విచక్షణనీ వివరిస్తూంటే అది పెదవి దాటని నవ్వుల్ని గుమ్మరించుకుంటూనే వుండిపోయింది...!!

ఒక జీవి, ఆ జీవి తాలూకు జీవితం అలా అలా వ్యక్తుల జీవన శైలిని ఆధారం చేసుకుంటూ ప్రపంచ చరిత్ర నడుస్తుందనీ, అలా కొందరి వ్యక్తుల భౌతిక నైతిక ప్రవర్తనా పరివర్తనలతో అది పునీతం అవుతూ వుంటుందని పెద్దలు చెబుతూ వుంటారు. కానీ రకరకాల అనుభవాల బరువుల్ని మోసిన శరీరానికి పెద్ద పీట వేసిందెవరు?? మనసు, మేధ, ఆత్మ అంటూ అనుభూతుల్ని పట్టుకుని ఎదుగుతూ పరమాత్మను చేరుకుందుకూ, లేదా ఆయనలో ఐక్యం కావాలని ఆరాటపడ్డంలోనూ తప్పులేదు గానీ – అందుకు ఆలంబన అయిన ఈ అవయవ నిర్మాణానికి అందిన కితాబులెన్ని?? అనారోగ్యాలకు, ప్రమాదాలకు లోనయినప్పుడు ఈ కట్టెను తిట్టనిదెవరు – శాపాలు పెట్టనిదెంతమంది??

అవును... అప్పుడప్పుడు నాకిలాంటి ఆలోచనలు రావడానికి కారణం మా మామయ్య... ఆయనకు ఎనభై యేళ్ళు దాటాయి... ఇప్పటికీ నిండుగా ఆరోగ్యంగా వుంటాడు... నిత్యం నవ్వుతూనే వుంటాడు. నీరసంగా నిస్సత్తుగా వున్నవాళ్ళను చూసి వెక్కిరిస్తాడు.... ఆ పైన పక్కన కూర్చోపెట్టుకుని తన మాటలతో వేయి ఏనుగుల బలం అందిస్తాడు.... కానీ ఆయన్ని ఇంట్లో భార్య, చుట్టాలూ అందరూ అపార్థం చేసుకున్నవాళ్ళే.

"ఇన్నేళ్ళు వచ్చినా మీ మామయ్యకు సిగ్గులేదయ్యా... ఇంకా కుర్రవాణ్ణనే అనుకుంటాడు" అంటుంది అత్తయ్య... మెటికలూ విరుస్తుంది, వెనక!! అప్పట్లో మామయ్య రాజారావుగారిని నేనూ అనుమానించాను. ఆయన తత్వాన్ని బోధపర్చుకోలేకపోయాను...!!

నేనూ పద్మా, ఇంటికి వచ్చాం.... ఆ సాయంకాలం నాతో పనిచేసిన నలుగురైదుగురు స్నేహితులు మా ఇంటికి వచ్చారు. అందరూ, ఆనాటి నుండి నేనెలా నడుచుకుంటే బావుంటుందో, ముందు రోజుల్లో అయినవాళ్ళతో ఎలా ప్రవర్తిస్తే చీకాకులకు, మనస్పర్థలకు దూరంగా వుండవచ్చో చెప్పారు. ఆ పైన అంటీ ముట్టని తత్వానికి టీకా తాత్పర్య వివరణలు ఇచ్చారు. "రిటైర్‌మెంట్ అంటే, అది కర్మ పరిపక్వానికి మొదటి మెట్టు రామంగారూ. ఒక ప్రస్థానం అయింది. ఇక మహాప్రస్థానమే మిగిలి వుంది... ఆడపిల్లలకు దారిచూపించారు. మీ బాధ్యతలు నెరవేర్చారు. కొడుకు డాక్టరయ్యాడు. ఇక కావల్సిందేం వుంది... మీరు, ఫక్తు స్పెక్టేటర్‌గా వుంటే చాలు..." నేను నెమ్మదిగా అన్నాను... "ఏం చేశానండీ...వెనక్కి తిరిగి చూసుకుంటూ ఇదీ అని నా ఖాతాలో ఏం జమ అయ్యిందో అర్థం కావడం లేదు. నా వల్ల నాకూ నా పిల్లలకు తప్ప ఎవరికీ ఏ మేలు జరగలేదు."

చీకటి పడింది... పద్మ పన్లు అన్నీ పూర్తి చేసుకుని పడగ్గదిలోకి వచ్చింది. నా పక్కనే కూర్చుని కాసేపు నా వైపు చూసి, "ఓ మాట" అంది.... నేను పద్మ వైపు చూశాను.

"ఇంతకాలానికి తీరిక చిక్కింది... ఓసారి మా నాన్నని చూసివద్దాం... ఏమంటారు?"

"రిటైరయి కూడా అత్తవారంటికి వెడితే అంతా నవ్వుతారు. అందునా సంక్రాంతి పండగ రోజులు."

"మా ఇంటికి అల్లుడిగా కాదండి... పెద్ద మనిషిగా రండి. సరేనా?" నాకు పద్మ మాటలతో నవ్వొచ్చింది. ఆమెను ఆట పట్టించాలనీ అన్పించింది.

"అయితే పండక్కి మీ వాళ్ళేం పెట్టరని ముందే చెప్పేస్తున్నావన్నమాట."

పద్మ నవ్వేసి సవాల్‌గా అంది. "పూర్వంలో అలిగి, చెట్టెక్కి మీరెన్ని సాధించుకోలేదని! మా వాళ్ళు పెట్టింది చాలు... పైగా ఈసారి మా అమ్మకీ నాన్నకీ న్యాయంగా ఖరీదైన బట్టలు మనమే పెట్టాలి..."

"హేట్సాఫ్ పద్మా... నీలాంటి గడసరిని కన్న మామయ్య ధన్యుడు..." నేను నవ్వేశాను.

"ఇందులో గడుసుతనం ఏం లేదు. మంచితనమే ఉంది".

"ఊరికే అన్నాను లేవోయ్... ఏం బాధ పడొద్దు.."

పద్మ నెమ్మదిగా, "నాకు తెలుసులెండి.... మనింటికి అల్లుళ్ళు వచ్చిన తర్వాత మీకు కనువిప్పు అయ్యింది... ఏదైనా అనుభవంలోకి వస్తే గాని తెలియదంటారు. ఇదేనేమో? అది సరే!..." అని ఆగిపోయింది.

"ఏమిటీ?"

'అదే మన సూర్యప్రకాశం సంగతండీ... వాడికి ముప్పై ఏళ్ళు దాటాయి. వాడి పెళ్ళి సంగతి ఏం ఆలోచించారు... మళ్ళీ ఉత్తరం రాశారా?"

"రాశాను పద్మా... ఏదీ రాయడు - జవాబు... ఉద్యోగంతో తీరిక లేదంటాడు... వీడొక్కడే డాక్టరు కాబోలు ఆ ఊళ్ళో..."

"నాకుభయంగా వుందండి... వాడు చాలాసార్లు నాతో బ్రహ్మచారిగా వుండిపోతానమ్మా అంటూండేవాడు."

నేను నవ్వేశాను... "వాడేదో వాగుంటాడు. పోనీ టెలిగ్రాం యిచ్చి రప్పించనా..." పద్మ కాసేపు ఆలోచించి, "అది కాదండీ, మనం ఎలాగూ మా నాన్ననీ అమ్మనీ చూసి వద్దామనుకుంటున్నాం... వాడికి అమ్మమ్మ తాతయ్య అంటే ప్రాణం కదా. తాతయ్యకి వంట్లో బాగోలేదనీ - నిన్ను చూడాలనుకుంటున్నారనీ ఓ ఉత్తరం రాసి పడెయ్యండి... వాడ్ని మా నాన్నగారే దారిలో పెట్టాలి..."

నేను తలూపాను... ఆ తర్వాత ఇద్దరం ఇంటి గురించి, ఆడపిల్లల గురించి, భవిష్యత్ గురించి చాలాసేపు మాట్లాడుకుంటూనే ఉన్నాం. ఆ మాటల్లో కొన్ని ఆనందాన్నిచ్చాయి. మరికొన్ని బాధల్ని రేపాయి. అప్పుడే నాకు మసక వెలుతురులో గోడ మీద వున్న ఫోటో

కన్పించింది. అది శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి గీతోపదేశం చేసే సన్నివేశం. పడకగదిలో ఏకశయ్య మీద పడుకుని గతాన్ని, వర్తమానాన్నీ, భవిష్యత్‌నీ తవ్వుకునే భార్యాభర్తలు చాలాసార్లు ఒకరు పార్థుడి అవతారం, మరొకరు శ్రీకృష్ణుని పాత్రా తెలియకుండానే పోషించుకోవడం జరిగిపోతుందేమో... ఇల్లు, సంసారం, సమాజం, లోకం కురుక్షేత్ర సంగ్రామ స్థలాలయినప్పుడు, సంశయ క్షేత్రాలయినప్పుడు, వ్యక్తులు భీరువులవుతారు. మరొకసారి ధైర్యస్థులూ అవుతుంటారు. నిత్యపోరాటాలు, ఆరాటాలూ, అంతలోనే ఆనందాల ఆర్భాటాలూ, మైమరపులు ఈ ఆటకి తప్పవేమో!!

❖ ❖ ❖

మేం వెళ్ళేసరికి రాజారావు మామయ్య వాళ్ళ ఇంటి ముందు స్థలంలో నలుగురైదుగురు పెద్ద మనుషులతో కలిసి ఊళ్ళో వాళ్ళకు సంతర్పణ చేస్తూ కన్పించాడు. పెనుతుపాను వచ్చి ఊరిని నానా బీభత్సం చేసిపోతే నిరాశ్రయులైన వాళ్లకు తనింట్లో చోటు చూపించాడుట. జనం ఇరవై ముప్ఫై మందిదాకా వున్నారు. భోజనాలు చేసి, కృతజ్ఞతలు చెప్పి ఒక్కొక్కళ్ళే వెడుతున్నారు. మామయ్య మా ఇద్దర్నీ చూసి లోపలికి ఓ కేక పెట్టాడు. రుక్మిణి అత్తయ్య లోపలి నుంచి వచ్చి మమ్మల్నిచూసి ఆనందపడి... మేం ఇంట్లోకి వెళ్ళాం.

"అంతా తెలిసే వుంటుంది... ఇప్పుడిప్పుడే మన ఊరు ఊపిరిపోసుకుంటోంది రామారావు" అంటూ మామయ్య మా దగ్గర వున్న కుర్చీలో కూర్చున్నాడు. మాటలు అయ్యాయి. నేనూ పద్మా భోజనాలు చేశాం... అందరం ముందు హాల్లో చాపల మీద తలగడాలు పెట్టుకుని కూర్చున్నాం. మామయ్య ఉయ్యాల బల్ల మీద కూర్చుని అత్తయ్య తుని తమలపాకులు, సున్నం రాసి ఈనెలు తీసి యిస్తుంటే తాంబూలం సేవిస్తున్నాడు. మామయ్య నా గురించి అడిగాడు... నేను కొంచెం చెప్పాను. పద్మ నేను చెప్పినదానికి నగిషీలు అద్ది మరీ చెప్పింది.

"అంతా బాగానే వుంది.... ముందేం చేద్దామనుకుంటున్నారు?"

"ఏం వుంది నాన్నా.... విశ్రాంతి తీసుకోవడం... అంతేకదా". రాజారావు మామయ్య తను ఊగుతున్న ఉయ్యాలను ఓ కాలితో ఆపి, "నీ మొహంలా వుంది... ఏం విశ్రాంతి కావాలే, మీకు - ప్రభుత్వ ఉద్యోగం చేసి మీ ఆయనగారూ,వండివార్చి నువ్వూ అంత అలిసిపోయారా, ఏం?" అంటూ ప్రశ్నించాడు.

"మరేం చెయ్యమంటారు? పిల్లల చాకిరీతో, మనవల పెంపకంతో నేను అలిసిపోయాను."

"ఏదో ఒకటి చెయ్యాలి... అంతేగాని కాళ్లు బారజాపుకొని గాలిమేస్తూ బతకకూడదు. ఇద్దరూ ఏదో వ్యాపకం పెట్టుకోండి...జీవితానికి ఏదో ఓ పరమావధి వుండాలి కదా?"

"అంటే." నేను అన్నాను.

"మీరిద్దరూ ఓ మాదిరిగా చదువుకున్నారు. చదువుకు అంతెక్కడ? బెనరాస్ పోయి యం.ఎ. చదవవచ్చు... లేకపోతే ఏ భగవద్గీతో, ఉపనిషత్తులో, వివేకానంద, అరబిందో రచనలో చదివి, వాటికి అనువాదాలు చేయవచ్చు. దాంతో పుస్తకాల్లో చదివింది జీవితానికి అన్వయించుకోవడం ఎలాగో తెలుస్తుంది. చాలాచోట్ల సెల్ఫ్ రియలైజేషన్ సెంటర్స్ అవి వున్నాయి...వాళ్ళు శరీరాన్ని మనసునూ ఉన్నత దశకు పోయే పద్ధతులు నేర్పుతారు... బావుంటుందని విన్నాను..."

"అమ్మో... అంత తీరికా, ఓపికా వుండాలి కదా నాన్నా.."

మామయ్య నవ్వేశాడు... ఆ పైన "మనసుంటే రోజుకు ఎన్ని గంటలయినా పని చేయవచ్చు. శ్రమ అన్పించదు. పైగా మెదడు పదును తేలుతుంది. అలా కాకుండా కొడుకులతో కోడళ్ళతో భేటీపడుతూ, డబ్బు కోసమో, పౌరుషాల కోసమో ఏళ్లు ఏళ్ళు ఖర్చు చేయవచ్చు... అంతువుండదు. మీ అమ్మ చూడు ఎప్పుడూ ఏదో రంధి పెట్టుకుంటుంది... కాలికీ మెడకీ వేసుకుంటుంది... కిందా మీదా అవుతూనే వుంటుంది" అన్నాడు.

రుక్మిణి అత్తయ్య వెంటనే అందుకుంది... "ఈయన అలాగే మాట్లాడతారు. రామం.." అంటూ ఉక్రోషంతో కళ్ళనీళ్ళు తిప్పుకుంది. కాసేపు ఆగి, "ఈ ఎనభయ్యో పడి దాటిన వయసులో శ్రమ పడొద్దంటాను. వళ్లు దాచుకోరు. డబ్బు మంచినీళ్ళలా ఖర్చు చేస్తారు. దానాలూ, ధర్మాలూ – అడగనేవద్దు... ఉదయం లేచి పొలానికి వెడతారు. వద్దన్నా వినకుండా గొడ్డు చాకిరీ చేస్తారు. భోజనం నాలుగు మెతుకులు కెలికి, కొత్తగా పెట్టిన కాలేజీకి పరిగెట్టి అక్కడ పైసా తీసుకోకుండా సంస్కృత పాఠాలు చెబుతారు. మధ్యాహ్నం కాస్తంత విశ్రాంతి... సాయంకాలం స్కూలు గ్రౌండుకు వెళ్ళి పిల్లలకు ఆటలు నేర్పుతారు. ఈ వయసులో, వాళ్ళతోపాటు పరుగు పందాలు మీకెందుకంటే నా మీద లేచిపడతారు."

"నాకు శక్తి వుంది... నేను ఆటలాడితే, పాటలు పాడితే నువ్వెందుకు సిగ్గుపడాలి... నువ్వూ ఆడుకో మనవలతో, నేను కాదంటానా? కీళ్ళనొప్పులూ, నడుం నొప్పులూ కూర్చుంటే తగ్గవు... హుషారుగా వుంటేనే ఏదైనా..."

"చాల్లెండి, సంబడం!"

"ఇవన్నీ మా ఆయన చేయలేరు నాన్నా..."

"పోనీ మీ ఇంట్లోనే ఏ యోగా క్లాసులో ఏర్పాటు చేసుకోండి...ప్రాణాయామం, ధ్యానం అలవాటయితే శరీరం, మనసూ రెండు పరిశుభ్రమవుతాయి."

"ఇది బాగానే వుంది పద్మా" అన్నాను నేను.

రాజారావు మామయ్య నవ్వేశాడు... ఆ పైన నెమ్మదిగా అన్నాడు. "చూడు రామారావు, వయసు మీద పడిందనీ, అంతా అయిపోయిందనీ ఎప్పుడూ అనుకోవద్దు. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ లాంటి పశ్చిమదేశాల్లో వుండే నా వయసువాళ్ళతో నేను పెన్ ఫ్రెండ్‌షిప్

చేశాను. అక్కడ ఎవరూ కూడా వయసును చూసి భయపడిపోరు.... ఫ్రాంక్లిన్ అనే ఒకాయన తన డెబ్బైఐదో ఏట వారానికి యాభై మైళ్లు పరిగెడతారు. రోజుకు ఐదువందల గుంజీలు తీస్తాడు. ఇదేమిటంటావ్? మరొకాయన ఆల్బర్ట్ ఇవిస్... ఉదయం తొమ్మిది గంటల నుంచీ రాత్రి పదకొండు గంటల వరకూ ఏకబిగిన పనిచేస్తాడు. ఈ వయసులో సైకోథెరపీ మీద ముప్పై పుస్తకాలు రాశాడు. మరొకాయన మానసిక రుగ్మతలతో బాధపడుతూ వుండేవాడు. కుంటివాడయ్యాడు. కానీ ఒకరోజు ఫ్రాన్స్‌లో వున్న వౌమౌంట్ శిఖరపు ఫొటో చూశాడుట. అది ఎక్కితే భయం పోతుందనిపించి, నమ్మకంకుదిరి ట్రయినింగ్ తీసుకున్నాడు. గైడ్‌ని ఏర్పాటు చేసుకొని ఆయన ఆ శిఖరం ఆరుసార్లు ఎక్కాడు. ఆ తర్వాత రోజూ ఆరు మైళ్లు పరిగెట్టడం అలవాటు చేసుకున్నాడు. దీనికేమంటావ్?? ఏ పరమావధీ లేకుండా జీవితాన్ని అనవసర విషయాల మీద వ్యర్థం చేసుకుంటే వార్ధక్యం కోరలు జాపుకొని మీదపడుతుంది. సిన్సియారిటీ, హ్యూమిలిటీ, పెర్సవెరెన్స్ ఈ మూడు మనిషికి ముఖ్యం అంటారు పెద్దలు. ఇవి వయసుని ఊరి పొలిమేరలకు గెంటిపారేసి, వ్యక్తిని నిత్యం యువకుడిగా నిలబెడతాయి."

ఇంతలో వీధిలోంచి ఇద్దరు యువతులు పుస్తకాలు తీసుకుని లోపలికి వస్తూ 'తాతగారూ!' అని పిల్చారు.

రాజారావు మామయ్య వాళ్ళని చూసి 'రండి మనవరాళ్ళూ... కూర్చోండి వచ్చేస్తున్నా" అని – లోపలికి వెళ్ళి గ్లాస్కో పంచీ, ఖద్దరు లాల్చీ వేసుకుని అద్దం ముందు నిలబడి తల దువ్వుకుని, "పద్మా, నేను వీళ్ళతో కోచింగ్ సెంటర్‌కి వెళ్ళొస్తానమ్మా... వీళ్ళు యంసెట్‌కి తయారవుతున్నారు. ఈనాటి విద్యావిధానం, ఇప్పటి చదువుల్లో వచ్చిన మార్పులూ తెలుసుకుందామనిపించింది. కొంచెం ఖర్చు అయినా జ్ఞానం అబ్బుతుంది కదా" అని చెప్పి పిల్లల్ని చూసి 'పదండి మనవరాళ్ళూ' అంటూ వాళ్ళతో కలసి వెళ్ళాడు "ఇదీ మీ నాన్నగారి తంతు" అంది రుక్మిణత్తయ్య...

అంతలో వీధిగేటు ముందు ఆటో ఆగింది... గేటు తెరుచుకుని వచ్చిన మనిషి సూర్యప్రకాశం. నేను లేచి వాడికి ఎదురువెళ్ళాను. పద్మ కూడా సూర్యాన్ని చూసి వెనకే వచ్చింది.

"మీరు ఎప్పుడు వచ్చారు, నాన్నగారూ" అంటూ సూర్యం లోపలికి వచ్చాడు. అత్తయ్య మొదట మనవణ్ణి పోల్చుకోలేక పోయింది సూర్యం. "అమ్మమ్మా నేను" అంటూ దగ్గరగా వెళ్ళాడు. పద్మ నా వైపు చూసింది. నేను నవ్వాను.

❖ ❖ ❖

రాజారావుగారికి దూరం నుంచే వాకిట్లో ఉయ్యాల బల్ల తలగడకు ఆనుకుని పడుకున్న సూర్యం కన్పించాడు. మనవణ్ణి చూడగానే ఆయన సంతోషం పట్టలేకపోయాడు.

"ఏరా అబ్బీ... ఎప్పుడు వచ్చావురా" అంటూ సూర్యం పక్కనే చోటు చేసుకుని

కూర్చున్నాడు...

"ఓ గంట అయింది తాతయ్యా..."

"నిన్ను చూసి ఎన్నో ఏళ్ళయిందిరా... అమ్మమ్మ ఏమన్నా పెట్టిందా? ఇంట్లో పూతరేకులు, కారప్పూసా ఉన్నాయి... ఓ పట్టాన బయటకు తీయదు. చీమలు, ఎలకలూ తినగా మిగిలినవే మనకు దక్కుడు..." అప్పుడే రుక్మిణి లోపలి నుంచి వచ్చింది..."మీ మాటలు విన్నానులెండి" అనేసింది నవ్వుతూ.

రాజారావుగారు అటూ ఇటూ చూసి "అమ్మాయీ, అల్లుడు ఏరి, కనిపించరేం?" ప్రశ్నించాడు.

"అల్లుడు వాళ్ళ స్నేహితుల్ని చూడ్డానికి, రామచంద్రపురం వెళ్ళాడు. మీరిద్దరూ లేస్తే భోజనాలు వడ్డిస్తాను..."

రాజారావుగారూ, సూర్యం భోజనాలు చేసి డాబా మీదకు వెళ్ళారు. చెరోపక్క మీద కూర్చున్నారు. ఇద్దరూ ఓ పది నిముషాలు లోక వ్యవహారాలు మాట్లాడుకున్నారు. రాజారావు గారు కాసేపు ఆగి, "అన్నీ బాగానే వున్నాయి... ఇక నీ సంగతి... చదువయింది... ఉద్యోగం చేస్తున్నావు... పెళ్ళి మాటేమిటి?" అడిగాడు. సూర్యం మాట్లాడలేదు.

"నీ వయసు నాకు తెలుసురా అబ్బీ.... కానీ నీ ఆలోచనలేమిటో నువ్వు చెబితే బావుంటుంది..." సూర్యం మళ్ళీ మాట్లాడలేదు. "ఎవర్నయినా ప్రేమించావేమిటి... చెప్పు... సిగ్గుపడొద్దు..."

"అవును"

"ఇంకేం, అమ్మాయి రూపురేఖా విలాసాదులతో నిమిత్తం లేదు గానీ, అడ్రసు చెప్పు, చాలు. మీ అమ్మా నాన్నా ఏమనుకోనీ... గ్రంథం నేను నడిపిస్తాను..."

సూర్యం కాసేపు అటూ యిటూ చూశాడు. ఆ పైన నెమ్మదిగా అన్నాడు.... "తాతయ్యా ఇది జరిగింది ఇప్పుడు కాదు. చదువుకుంటున్న రోజుల్లో విషయం... మేం అందరి అనుమతితో పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. కానీ ఆ అమ్మాయి హఠాత్తుగా చనిపోయింది..." రాజారావుగారు "అరెరే" అనేశాడు.

"నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు తాతయ్యా. నాకు బతుకంటే విరక్తి పుట్టింది..." రాజారావు గారు వింటున్నారు...

"నేను చాలా తప్పులు చేశాను తాతయ్యా... చేస్తున్నాను కూడా.."

"అవన్నీ నాకు తెలుసురా. నువ్వు తాగుడికి అలవాటుపడ్డావు. ఒక అమ్మాయిని దురదృష్టవశాత్తు పొందలేక – మానసికంగా కుంగిపోయి, డబ్బుతో ఆడవాళ్ళను కొనుక్కుంటున్నావు. డబ్బే కాదు నువ్వు పోగొట్టుకుంటోన్నది... ఆరోగ్యం... ఆ పైన మానసిక చైతన్యం... ఈ విషయాలన్నీ నాకు మీ వూళ్ళో వుండే నీ గురువులు చెప్పారు. వాళ్ళు నా శిష్యులు కాబట్టి... ఇక నీ అవతారం చూస్తే అంతా తెలుస్తూనే వుంది.ముఖ్యే

ఏళ్లు దాటాయి నీకు. కానీ నలభై ఏళ్లు దాటిన వాడిలా కన్పిస్తున్నావు..."

"నేనేం చేయలేను తాతయ్యా."

రాజారావుగారు నవ్వేశారు. ఆపైన అన్నారు... "మీ డాక్టర్లు నమ్ముతారోలేదో గాని అందరి శరీరాలను - మామూలు కంటికి కన్పించిన ఒక వేపర్, గచ్చకాయ రంగులో వుండేది కాపాడుతూ వుంటుందిట... దాన్ని ఆధ్యాత్మికవాదులు, నెర్వస్ ఎన్‌వెలప్ అని పిలుస్తారు... మనం మనసా వాచా, కర్మణా శుద్ధిగా వున్నంత వరకూ శరీరాన్ని రుగ్మతలు ఏమీ చేయలేవుట... మనిషి కట్టడి, అదే, నీతి తప్పి హృదయాన్ని చంపుకోవడం మొదలుపెడితే మనిషి కుంగిపోవడం, అపజయాల పాలవడం, రోగాల బారిన పడ్డం మొదలవుతుందిట. శరీరాన్ని ప్రాణాన్ని, అంతఃకరణను చిన్నచూపు చూడ్డంతో ఈ రక్షణకవచానికి బీటలు పడి శరీరంలో శక్తిపోతుంది. దాంతోనే నడివయసులో వృద్ధాప్యం వచ్చేస్తుంది. రకరకాల మానసిక ఒత్తిడులకు బానిస అవుతుంది..." ఆయన ఆగి సూర్యం వైపు చూసి తిరిగి అన్నాడు.

"మనల్ని మన శరీరం వెక్కిరించకుండా వుండాలంటే మనలో శక్తుల్ని వృథా చేయకూడదు. ఏ పనైనా ప్రశాంతతో చెయ్యి...... నిశ్శబ్దంలో, శాంతి కాముకత్వంలో గొప్ప శక్తి దాక్కుని వుంటుంది."

"చెయ్యి దాటిపోయింది తాతయ్యా... నేను పతనమయి చాలా కాలమయింది... ఇక పెళ్ళివయసా... అదీ దాటిపోయింది..."

"జీవితాన్ని పురోగమనం వైపు మళ్ళించుకోగల్గడం నేర్చుకుంటే వయసేం చేయదు... తన ఎదుగుదలను వదలనివాడు - వాడు శతాయువు అయినా యువకుడే అవుతాడని వేదంత గ్రంథాలు చెబుతున్నాయి రా."

"తాతయ్యా" అంటూ సూర్యం నిశ్శబ్దంగా రోదించడం మొదలుపెట్టాడు... రాజారావుగారు మౌనంగా మనవడి వీపు నిమిరి, "ఊరుకో నేనున్నాగా" అంటూ ఓదారుస్తూ తిరిగి అన్నాడు... "సూర్యం... పరిస్థితుల చెడు ప్రభావంతో మనుషులు తాత్కాలికంగా పతనమవుతారు. ఈ వేళ నీకు ఇన్ని సూక్తులు చెబుతున్న నేను యాభై ఏళ్లు వచ్చేవరకు నా ఇష్టం వచ్చినట్టే ప్రవర్తించాను. వయసు పొంగు, డబ్బు, అహంకారం నా చేత ఎన్నో బురిడీలు కొట్టించాయి. మీ అమ్మమ్మను ముప్పుతిప్పలు పెట్టాను. అవమానపరిచాను. కానీ ఆమె తనశారీరక వాంఛల్ని అదుపులో పెట్టుకుని నెమ్మదిగా ఆధ్యాత్మికత వైపు మళ్ళింది. ఆ తర్వాత నేను ఎంత బలవంతం పెట్టినా - ఇరవై ఐదేళ్ళు నాకు ఎడంగా వుండి, కోరికల్ని నిగ్రహించుకుంది... అంతవరకూ ఆమెను ఓడించానని గర్వపడే వాణ్ణి... కానీ నేను ఓడిపోయానని తెలిసిన మరుక్షణం నుంచీ నాలో అంతర్మథనం మొదలయింది. ఆ సమయంలోనే ఎవరో గురువు దొరికారు. జరగిందంతా విన్పించి మార్గం చెప్పమని అడిగాను. కాళ్ళ మీద పడ్డాను. ఆయన నాతో 'నీలో అహంకారాన్ని

చంపుకో' అంటూ ఎన్నో చెప్పారు. అందుకే నీకు చెప్తున్నాను. నా మాట విను"

సూర్యం చీకటిలోకి చూస్తూ "తాతయ్యా, నా మీద నాకు నమ్మకం పోయింది... నేను తిరిగి..." అనీ ఆగిపోయాడు. రాజారావు గారు నవ్వేశాడు... నెమ్మదిగా సూర్యం ముందుకు వంగి, అతని గెడ్డాన్ని వేళ్ళతో పట్టుకుని ఆ పైన ఆ చేతిని చిన్నగా ముద్దు పెట్టుకుని అనునయంగా అన్నాడు... "అలా అనకూడదురా... తప్పు.... నీకో జరిగిన కథ చెపుతాను... విను" సూర్యం ఆశ్చర్యంగా చూశాడు.

"బయాజిద్ అనే సూఫీ గురువు ఒకాయన వుండేవారుట. ఆయన్ని ఎవరో ఒకసారి మీ వయసెంతండీ అని అడిగారుట. దానికి ఆయన ఏం జవాబు చెప్పాడో తెలుసా – నా వయసు నాలుగు సంవత్సరాలు అని! ప్రశ్నించిన పెద్దమనిషి ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకుంటే తిరిగి బయాజిద్‌గారు అన్నారుట – 'డెబ్భై ఏళ్ళుగా ఈ ప్రపంచం నా మీద తెరకప్పి, నన్ను దైవానికి దూరం చేసింది... కానీ నాలుగేళ్ళ క్రితమే నేను దైవాన్ని తెల్సుకోగలిగాను... చూడగలిగాను... అని'... దీనికే మంటావ్?"

సూర్యం తనలోని బాధంతా మర్చిపోయి చిన్నగా నవ్వేశాడు. ఆ నవ్వుని చూసి రాజారావుగారు నవ్వాడు.

"సూర్యం... నువ్వు చెప్పు... నా వయసెంతుంటుంది?"

"అమ్మమ్మని అడిగితే డెబ్భై దాటలేదంటుంది... ఆయనకు ఇంకా మీసం నెరవలేదు. ఆ మాత్రం తెలియదా, భడవా అనేస్తుంది... నువ్వే చెప్పు...?"

"అయితే విను. నేను సరిగ్గా ఎనభై ఆరేళ్ళ క్రితం పుట్టాను. అయితే కన్నుతెరిచింది. డెబ్భైయవ ఏట మాత్రమే.... కానీ – నేనింకా పరమాత్మ స్వరూపం తెల్సుకోలేకపోయాను.... కాబట్టి, ప్రస్తుతానికి నా వయసు పదహారు.... అదృష్టం కలిసొస్తే ఆ వయసు ఇంకా తగ్గవచ్చు."

సూర్యం పకపకా నవ్వాడు. తాతగారి వ్యాఖ్యానానికి! మనవడిలో చీకటిని చెదరగొట్టి చీల్చి చెండాడే ఆ నవ్వుని విని ఆయనా గలగల నవ్వేస్తూ, "ఆ... ఆ... అలానే నవ్వరా మనవడా... నవ్వులో విటమిన్ల, ప్రొటీన్లూ, ఐరన్... లాంటి పోషక పదార్థాలు వుంటాయిట. కానియ్...."

'మరి నీలెఖ్ఖన– నా వయసెంతో చెప్పు తాతయ్యా?"

"ఓ మనవరాలి మెళ్లో మూడు ముళ్లేసి, ఆమెను చేత్తో నడిపించుకుని నా దగ్గరకు వస్తే – అప్పుడు చెపుతానోయ్... అంతవరకూ నీతో మాట్లాడేది లేదు.... నేను కిందకి పోతున్నాను...సరేనా.." అంటూ రాజారావుగారు పక్క మీద నుంచి లేవబోయారు... సూర్యం ముందుకు వంగి తన చేత్తో తాతగారి గెడ్డం పుచ్చుకుని బతిమలాడ్డం మొదలుపెట్టి – ఆ తర్వాత ఆయన ముందు తలవంచాడు.